
● కథానిక

# సంగమం



## ఏడిద గోపాలరావు

రమణారావుకు ఉద్యోగం ఉంచి రిటైర్ అయిన తర్వాత కొత్తకొత్త అనుభవాలు, ఇబ్బందులు ఎదురుకావడం ప్రారంభమైంది. 'నీకు యాభై ఎనిమిదేళ్ళు పూర్తయ్యాయి. నీ సేవలు ఇక మాకు వద్దు. నీ పింఛను డబ్బులు నెలనెలా తీసుకో'-అని ప్రభుత్వం వారు రమణారావును రిటైర్ చేశారు.

స్వతహా, రమణరావు చాలా చురుకైనవాడు. స్కూల్లో, కాలేజీలో చదువుకుంటున్నప్పుడు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం, ఎన్‌సిసి, హోంగార్డు సర్వీసుల్లో నడుం బిగించడం, నాటకాలు ఆడడం అతని హాబీలు. బిఏ పాసు కాగానే సర్వీస్ కమిషన్ పరీక్షలో కూడా పాసై కేంద్రప్రభుత్వ ఉద్యోగంలో చేరాడు. 30 సంవత్సరాలు చిత్తశుద్ధితో పనిచేసి, అటు ప్రభుత్వ ఉన్నతాధికార్లు, ఇటు ప్రజల మన్ననలను పొందాడు. 30 సంవత్సరాల ఉద్యోగకాలమంతా ఢిల్లీ, బొంబాయి, బెంగుళూరు, కలకత్తాలలో గడిచి పోయింది. రమణారావు రిటైర్ కావడానికి మూడు నెలల ముందు సికింద్రాబాద్‌లో ఒక అపార్ట్‌మెంట్ కొన్నాడు. రిటైర్ కాగానే స్వరాష్ట్రానికి వచ్చి, స్వంత అపార్ట్‌మెంట్‌లో దిగాడు. రమణరావు భార్య లత గృహిణి. ఇంటిపట్టునే వుంటూ వంటావార్పులతో సతమతమవుతుంటుంది.

ఈ దంపతులకు ఒక కొడుకు, కూతురు-పెళ్ళిళ్ళు కావడంతో వారిద్దరూ వేర్వేరు ఊళ్ళలో కాపురాలు చేసుకుంటున్నారు-రమంరావు, లతలది చీకు చింతా లేని సంసారం.

వృద్ధదంపతులిద్దరూ తమ సొంత అపార్టుమెంట్‌లో చేరారు. ఉద్యోగం చేస్తున్నప్పుడు ఆఫీసు పనుల్లో తీరిక లేకుండా వున్న రమణరావుకు-రిటైర్ కాగానే ఇంట్లో కూర్చుని పని లేకుండా వుండడం బాధగా వుంది. ఏమీ తోచడం లేదు. చేయవలసిన ఇంటి పనులు ఎన్నో వున్నప్పటికీ, తాను ఏ పనీ లేక ఖాళీగా వుండడం బాధగా వుంది. తాను ఇక ఏ పనీ చేయలేని వాడినన్న భావం మనసులో చిగిర్చింది. దాంతో మనస్థిమితం లేకుండా పోయింది.

రమణరావుకు రోజు ఉదయం నిద్ర నుంచి లేవగానే దినపత్రిక చదివే ఒక దురలవాటు వుంది. ఏరోజు పత్రికలో చూసినా విశేషాలు ఒకలాగే వుండేవి-అవి 'మానభంగాలు, అత్యాచారాలు, ఆందోళనలు, నిరాహారదీక్షలు, కుంభకోణాలు, కథలు' వగైరా-

ఒకరోజు పేపరు చదువుతున్న రమణరావు-

'ఏవండీ' అంటూ లత పిలిచిన పిలుపుకు ఉలిక్కిపడ్డాడు.

'చూడండి-మీరో చిన్న సాయం చేయాలి నాకు' అంది లత.

'ఏమిటోయ్ చెప్పు' అన్నాడు రమణారావు.

'ఒకసారి మేడమీదిపై అంతస్తుకి వస్తారా?' అని అనునయంగా అడిగింది.

లత-ఇంత స్నేహపూర్వకంగా-దీనంగా అడిగిందంటే ఇందులో ఏదో తిరకాసు వుందని రమంరావుకు తెలుసు. ఆ ఉద్దేశంతోనే లతను తేరిపార చూశాడు. లత చేతిలో ఒక బకెట్-ఆ బకెట్‌లో ఉతికి, నీళ్ళు పిండిన కొన్ని చీరలు వున్నాయి.

'ఏం ఇవేళ బట్టలు ఉతికే పనిపిల్ల రాలేదా?' అని అడిగాడు.

'రాలేదు-అందుకే-నాకు ఈ పని తప్పలేదు. చూడండి. మీరు ఒక్కసారి నాతో డాబామీదికొస్తే, ఇద్దరం కలిసి, కాస్త ఈ చీరలు ఆరవేసి వచ్చేయవచ్చు' అర్థోక్తిగా, ప్రశ్నార్థకంగా ఆగిపోయింది లత.

ఈ మాటవిని-లత ముఖంలోకి చూశాడు రమణారావు. దీంతో లత-భర్త మీద మరో బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించింది.

'అవున్లెండి. ఇది ఆడపని, నన్ను పిలుస్తావేంటి అనా?' అంటూ ఇబ్బంది పెట్టింది భర్తను.

కొడుకు, కూతురు పెళ్ళిళ్లై-వెళ్లిపోయిన తర్వాత, గత ఏడేనిమిదేళ్ళుగా రమణారావుపై ఇటువంటి బ్రహ్మాస్త్రాలు ప్రయోగించి, లత భర్తతో ఇంటిపనులు చేయించుకుంటోంది.

రమణారావు మెతకపడడం చూసి-లత మరోమాట అంది. ఆ మాట-అమ్మకాల్లో షావువాళ్ళు డిస్కౌంట్ ఇస్తారు-అటువంటిది.

'చూడండి-ఇప్పుడు పై డాబామీద ఎవ్వరూ వుండరు. చుట్టుపక్కల డాబాల మీద కూడా ఎవ్వరూ వుండరు. మీరో పదినిమిషాల్లో పైకొస్తే-ఈ బట్టలన్నీ ఆరవేసి వచ్చేయవచ్చు' అంతే రమణారావు-బుట్టలో పడ్డాడు.

చుకున్నాడు రమణారావు.

'ఆ సర్లే నడు'-అన్నాడు రమణారావు.

లత-ఇంటికి తాళం వేసింది. చీరల బకెట్‌ను చేత్తో పట్టుకుంది. 'చూడండి. ముందు నేను మేడ మీదికి వెడతాను. ఓ రెండు నిమిషాల తర్వాత మీను పైకి రండి!' అని చెప్పి బకెట్ చేత్తో పుచ్చుకుని మెట్లెక్కి చకచకా పైకి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళింతర్వాత నిమిషాలు లెక్కపెడుతూ గుమ్మం ముందు నించున్నాడు రమణారావు. అప్పుడు పక్క అపార్ట్‌మెంట్ సుందరమ్మగారు తలుపుతీసి రమణారావును చూసి 'అక్కయ్యగారు వున్నారండీ-ఒక్కసారి పిలుస్తారా' అంది.

'లేదండి. ఇప్పుడే మేడమీదికి వెళ్ళింది. చీరలు ఆరవేసేందుకు' అని నాలిక కరు

'ఓ తాళం వస, చిరలు ఆర పట్టం

దుకు డాబా మీదికి వెడుతున్నారా!-ఆ పని అయిన తర్వాత, అక్కయ్యగారిని ఒకసారి నేను రమ్మన్నానని చెప్పండి' అని చిరునవ్వు నవ్వుకుంటూ సుందరమ్మ లోనికి వెళ్ళి తలుపేసుకుంది.

రమణారావు తెల్లబోయాడు.

గుట్టురట్టయింది అనుకున్నాడు.

ఇంతలో-డాబా మీదనుంచి లత 'రండి రండి పైకి' అంటూ రమణారావును పిలిచింది.

సుందరమ్మగారు-మళ్ళీ తలుపుతీసి-'బావగారు-పైకి వెళ్ళండి-అక్కయ్యగారు పిలుస్తున్నారు' అని రమణారావును హెచ్చిరించింది. రమణారావుకు వళ్ళు మండింది. ఏం చేయలేక-ఆమె వైపు వెర్రిగా చూస్తూ, నెమ్మదిగా మెట్లెక్కి డాబా మీదికి వెళ్ళాడు.

'అదేమిటండి-ఓ రెండు నిమిషాలు ఆగి రమ్మంటే మరీ ఆలస్యం చేశారు' అంది లత రమణారావుతో.

'అది సరే-పైనుంచి నువ్వు ఆ కేకలేమిటీ? నీ కేకలు విని-పక్కింటి సుందరమ్మ' అక్కయ్యగారు పైనుంచి పిలుస్తున్నారు చీరలు ఆరవేసేందుకు. మీరు వెళ్ళండి బావగారు' అంటూ నన్ను ఆట పట్టించింది అన్నాడు రమణారావు.

'చీరలు ఆరేసేందుకని ఆవిడకు ఎలా తెలిసింది? మీరు గాని చెప్పారా?' అంది లత.

'ఆ.. నిన్ను ఆవిడ పిలిచింది. నువ్వెక్కడంటే, డాబామీద చీరలు ఆరేస్తున్నావని చెప్పాను-మనం గుమ్మం తాళం వేసి వుండడం చూసి, నేను నీ వెనకే పైకి వస్తున్నానని గ్రహించి 'వెళ్ళండి బావగారు-అక్కయ్యగారికి సాయం చేసేందుకు పైకి' అంది-'ఈలోగా పైనుంచి నన్ను పిలుస్తూ నీ కేకలు' ఆగ్రహించాడు రమణారావు.

'ఆ ఏం-ఫరవాలేదు లెండి. మొన నేను మనింట్లో పంచదార నిండుకుంటే, హఠాత్తుగా వాళ్ళింట్లోకి వెళ్ళా- వాళ్ళాయన ఆవకాయ పిండిలో ముక్కలు కలుపుతుంటే, ఆవిడగారు జాడీలో నూనె పోస్తోంది. నన్ను చూసి సుందరమ్మ మొగుడు ఇబ్బంది పడ్డడు. ఆ-ఏం ఫర్వాలేదు. ఇందులో తప్పేముంది-ఒకరి కొకరు సాయంగా మన ఇంటి పనం చేసుకుంటే' అంది లత.

రమణారావుకు లత చీరలు ఎలా ఆరవేయాలో వివరించింది. 'రండి. ఈ చీర రెండు కొసలు గట్టిగా లాగి పట్టుకోండి. నేను ఆవతలి కొనలు పట్టుకుంటా' అంటూ చీర రెండు కొసలు రమణారావుకు అందించి, చీర ఆవలి కొసలు తను పట్టుకుంది లత-

'ఇప్పుడు చూడండి-చీరను లాగి పట్టుకోండి. గాలిలో ఊపండి. పట్టునడలకుండా చీరను ఒక్కసారి నేలమీద ఆరవేయండి' అని చెప్పి లత-ఈ పనంతా రమణారావు చేత నవ్యంగా చేయించింది.

ఈ విధంగా ఒక కొసను లత-మరో కొసను రమణారావు పట్టుకుని ఎనిమిది చీరలను ఆరబెట్టే ప్రక్రియకు వీళ్ళిద్దరికీ అరగంటపైనే పట్టింది.

ఆరవేసిన ఎనిమిది చీరలపై దంపతులిద్దరూ చిన్నచిన్నరాళ్ళు నాలుగువైపులా వుంచారు. చీరలు గాలికి ఎగిరిపోకుండా.

చీరలు ఆరవేస్తున్నంత సేపు రమణారావు-చాలాసార్లు అటు ఇటు చూశారు. తమను ఎవరైనా చూస్తున్నారేమోనని.

ఆఫీసులో పదిమంది క్రింది ఉద్యోగులను గడగడలాడించిన గెజిటెడ్ ఆఫీసర్ ఉద్యోగం రమణారావుది.

ఒక గెజిటెడ్ ఆఫీసర్-రిటైర్ కాగానే, ఇలా చీరెలు ఆరవేయాలా? ఇంటిపనుల్లో సాయం చేయాలా? భార్య కోరగానే, బజారుకు పోయి కాయగూరలు తేవాలా? ఇటువంటి ఎన్నో ఆలోచనలతో రమణారావు బుర్ర వేడెక్కిపోయింది.

రమణారావుకు జ్వరం వచ్చింది. ఐదు రోజులజ్వరంతో పడకవేశారు. ఈ ఐదు రోజులు తను మంచం మీద వుంటే లత చేసిన సేవలకు ఎంతో మురిసిపోయాడు రమణారావు. తనకు జ్వరమొస్తే లత పడిన ఆరాటం అతడిని ముగ్ధుడిని చేసింది. జ్వరం తగ్గగానే-తాను మళ్ళీ మామూలు మనిషి కావడంతో ఆమె పొందిన ఆనందం-తను ఎలా మరిచిపోగలడు.

పది రోజులుగా పనిమనిషి రావడం లేదు.

లత ఒక్కర్తే-డాబామీద పంచెలు, చీరలు, తన షర్టులు, పేంటులు ఆరవేయడం, జ్వరం వచ్చిన ఐదురోజులు తన ఆలనాపాలనా చూసుకోవడం, ఇంటి పనులు, వంటపనులు చేసుకోవడం, రమణారావుకు బాధ అనిపించింది. ఏం చేయలేక-మనసులో మాత్రం ఒక నిర్ణయానికి వచ్చాడు.

పక్కింటి సుందరమ్మగారి కుటుంబం హఠాత్తుగా ఇల్లు ఖాళీ చేసి మరోచోటుకు వెళ్ళారు. ఎదురింట్లో కొత్త దంపతులు దిగారు. రమణారావు జ్వరంతో వున్న ఈఐదు రోజుల్లో జరిగిన పరిణామాలివి.

జ్వరం తగగిన తర్వాత, రమణారావు ఆలోచనా తీరులో మార్పు స్పష్టంగా కనిపించింది.

రమణారావు-స్నేహితులతో బయటకు వెళ్ళి వస్తున్నా, ఇంటికి వచ్చిపోయే బంధుమిత్రులతో కాలక్షేపం చేస్తున్నా ఇంటిపనుల్లో-లత-అడగ్గానే-ఏమీ సంకోచించకుండా-ఆమెకు సహాయపడుతున్నాడు. ఈమార్పు చూసి లత ఆశ్చర్యపడింది. ఐతే, రమణారావు నిజాయితీని, చిత్తశుద్ధిని గ్రహించి ఎంతో సంతోషించింది.

ఒకరోజు-డాబా మీద భళ్ళున కాస్తోన్న ఎండలో-రమణారావు, లత ఉతికిన చీరలు, పంచెలు ఆరవేస్తున్నారు. ఎదురింట్లో కొత్తగా దిగిన కొత్తదంపతులు డాబామీదికి వచ్చారు షికారుగా.

'ఏమమ్మా, కులాసాగా వున్నావా? మీ కొత్తకాపురం ఎలావుంది' అని కొత్తింటి ఆవిడను, 'ఏమోయ్. ఈవాళ ఆఈసు లేదా?' అని ఆమె భర్తను పలకరించాడు రమణారావు.

'లేదండి'అన్నాడు కొత్తకాపురం పెట్టిన రామారావు.

'చూడండి బాబాయిగారు-మీరు, పిన్నిగారు ఇలా ఈ వయసులో కూడా ఒకరికొకరు సహాయపడుతూ పనులు చేసుకుంటుంటే చూడ్డానికి ముచ్చటగా వుందండి. మా వారి గురించి ఏం చెప్పను. ఈయన ఒక్క పనిలో కూడా నాకు సాయం చెయ్యరు-అన్నీ-ఈయనకు అమర్చి పెట్టాలి. చూడండి. బాబాయిగారిని చూసయినా నేర్చుకోండి' అంది ఆ కొత్తగా కాపరానికి వచ్చిన భార్య, భర్త రామారావుతో.

రమణారావు, లత-అటు,ఇటు ఒక చీరను లాగిపట్టుకుని గాలిలో వూపుతూ ఆరవేసే పనిలో వున్నారు. ఈ చీర ఆరవేత పనిలో వున్నా-రమణారావు ఏమాత్రం సంకోచించక, సిగ్గుపడక, నవ్వుతూ ఒక మాట అన్నారు.

'చూడమ్మా-ఆ వయసు అంతేనమ్మా. మీ ఆయన్నేమీ అనకు. పెళ్ళయిన కొత్తలోనూ, ఆ తర్వాత అంటే మా పిల్లలకు పెళ్ళిళ్లు అయ్యే వరకు-నేను కూడా మీ పిన్నికి ఏం సాయం చేసేవాడ్ని కాదు. ఆ తర్వాత అలవాటయ్యేయి ఈ పనులన్నీ. దాంపత్యమంటే-ఏ ఒక్కరూ మరొకరిమీద పెత్తనం చేయకూడదు. అది ఒక స్నేహంగా, జీవనదిలా ప్రవహించాలి. 'చెప్పేవారు ఒకరు-చేసేవారు ఒకరు' అన్నట్టు వుండకూడదు. ఒకరిది పైచేయి-మరొకరిది క్రింది చేయి కాకూడదు. ఇద్దరు సమాంతరంగా కాక, సమంగా ఒకే బాటను నడవాలి. అలా మనసా, వాచా పాలు, నీళ్ళలా కలిసిపోయి, నిశ్చింతగా, ప్రేమతో కొనసాగేదే సరస ఆనందమయ దాంపత్యం.

సర్లే-ఇవన్నీ, నెమ్మది నెమ్మదిగా మీరే తెలుసుకుంటారు అని ఖాళీ బకెట్ చేత వుచ్చుకుని, రమణారావు మేడమెట్లు దిగుతుంటే-లత కొత్తదంపతులు ఇద్దర్నీ 'రేపు మా పెళ్ళిరోజు. మా అబ్బాయి, అమ్మాయి దూరంగా వేర్వేరు ఊళ్ళల్లో వున్నందువల్ల రాలేకపోతున్నారు'-

'మీరిద్దరూ రేపు మాయింటికి భోజనానికి రావాలి' అని ఆహ్వానించి, రమణారావు వెనక హంసలా నడుస్తూ వెళ్ళిపోయింది.

అరవయ్యో పడిలో కూడా, కులుకుతూ, నవ్వుతూ, నవ్విస్తూ తుళ్ళిపడుతూ జీవించేస్తున్న ఈ ముసలి దంపతులను చూసి కొత్తదంపతులు ఆశ్చర్యంగా చూశారు.

'వీళ్ళిద్దరూ-రెండు జీవనదుల్లా ఉరుకులు, పరుగులు వేస్తున్నట్టు సజీవంగా వున్నారు కదు నళినీ' అన్నాడు రామారావు.

'రెండు జీవనదుల్లా కాదు-జీవనదుల సంగమంలా' అని సరిదిద్దింది నళిని.

'ఆ రండి. క్రిందికి వెడదాం' అన్నట్టు ఇవేళ బట్టలు ఉతికే పనిపిల్ల రాలేదు. నాకు బోలెడు పని. నాలుగు చీరలు, మీ పేంట్లు, షర్టులు ఉతికి ఆరేయాలి' అని నళిని వాపోగానే రామారావు గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్టయింది.

